

మూడునెలలకే మూలకు

నగర పంచాయతీలకు ఎలక్ట్రికల్ ఆటోలు వచ్చాయన్న సంబరం మూడునెలల ముచ్చటగానే మిగిలింది. వచ్చిన 9ఆటోల్లో 7 పనికి రాకుండా పోవడంతో వాటిని మూలనపడేశారు. మరో రెండు ముక్కుతూ మూలుగుతూ నడుస్తున్నాయి. దీంతో మళ్లీ పాత తోపుడు బండ్లు, ఆటోలే దిక్కయ్యాయి.

● నిరుపయోగంగా ఎలక్ట్రికల్ ఆటోలు ● మళ్లీ తోపుడు బండ్లు, పాత ఆటోలే దిక్కు

● తడిసిమోపెడవుతున్న ఆటో, ట్రాక్టర్ల మరమ్మతులు ● ఇటీవల మరమ్మతులకే రూ.7లక్షలు



మూలనపడ్డ ఎలక్ట్రికల్ ఆటోలు



ఎప్పటి నుంచో చెడిపోయి తుప్పుపట్టిన ఆటో



తోపుడు బళ్లే దిక్కు

ఎర్రగుంట్ల, జూలై 25: ఎర్రగుంట్ల నగరపంచాయతీలోని 9సచివాలయాలకు 9 ఎలక్ట్రికల్ ఆటోలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో ఇకపై నగరపంచాయతీలో రోజూ కసువు తీసుకెళ్లేందుకు ఇళ్ల వద్దకు ఆటోలు వస్తాయని ప్రజలు సంబరపడ్డారు. కొన్ని రోజులు నిశ్శబ్దంగా ఇంటి వద్దకు వచ్చి ఆటోలు ఆగేవి. పారిశుధ్య కార్మికుడు పిలిస్తే తప్ప ఆటో వచ్చినట్లు తెలిసేది కాదు. అయితే 15 రోజులకే బ్యాటరీ సక్రమంగా పనిచేయడం లేదని, చార్జింగ్ ఎక్కువసేపు ఉండడంలేదని, గేర్స్ సరిగా పడడంలేదన్న ఫిర్యాదులు మొదలయ్యాయి. దీని తర్వాత ఒక్కొక్కటిగా మూలన కూర్చున్నాయి. 15రోజులు కూడా పనిచేయని ఆటోలు రెండుమూడు ఉన్నాయి. ఇప్పటికే 9 ఆటోల్లో 7పూర్తిగా పనిచేయకపోవడంతో వాటన్నింటినీ పాత నగరపంచాయతీ కార్యాలయం వద్ద పెట్టారు. ఉన్న రెండు ఆటోలు కూడా ఎప్పుడైనా ఆగిపోవచ్చని సిబ్బంది సైతం వాపోతున్నారు.

జిల్లాలో అన్ని చోట్లా ఇంతే

జిల్లాలోని దాదాపు అన్ని మున్సిపాలిటీలకు ఎలక్ట్రికల్ ఆటోలొచ్చాయి. కానీ ఎక్కడా పట్టుమని నెలరోజులు కూడా పనిచేసిన దాఖలాలు లేవని అధికారులు పేర్కొంటున్నారు. ఒక మంచి ఉద్దేశంతో కోట్లు వెచ్చించి తెచ్చిన ఆటోలు నాసిరకం బ్యాటరీలు, ఇతర కారణాలతో మూలనపడ్డాయి. మూలనపడ్డ వాటికి బ్యాటరీ మార్చాలంటే ఒక్కొక్కటి రూ.30వేలు అవుతుందని, ఇంత డబ్బు పెట్టే ఆర్థిక స్థితి నగరపంచాయతీకి లేదన్న ఉద్దేశంతో వాటిని మూలన పడేశారు. ఆటోలు సరఫరా చేసిన కంపెనీ మెకానిక్కులు వీటి మరమ్మతులకోసం పూణేనుంచి రావాల్సి ఉంది. అయితే వారు ఫోన్లు ఎత్తరని, ఎత్తినా రిపేరీలు చేసేందుకు రావడంలేదన్న విమర్శలున్నాయి. వారు వచ్చేలోపే అవి తుప్పుపట్టి బాడీకూడా పనికిరాకుండా పోతుదని అంటున్నారు. దీంతో ఎలక్ట్రిక్ ఆటోల కథ కంచికి చేరినట్లేనని సర్వత్రా విమర్శలొస్తున్నాయి.

మరమ్మతులకే రూ.7లక్షలు

మామూలు ఆటోల డీజల్, రిపేరీ ఖర్చులు తగ్గించుకునేందుకు ఎలక్ట్రికల్ ఆటోలు పంపితే.. అవికూడా పనిచేయకుండా పోవడంతో తిరిగి డీజల్ ఆటోలు, ట్రాక్టర్స్‌నే ఉపయోగించుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఎనిమిదేళ్ల కిందట నాలుగు ఆటోలు నగర పంచాయతీకి వచ్చాయి. వాటిలో ప్రస్తుతం రెండు మాత్రమే ఉన్నాయి. ఒకటి తుప్పుపట్టి పోగా, మరొకటి బోర్‌కు వచ్చింది. దాన్ని బోర్‌చేసేందుకు అమ్యామ్యాలతో కలిపి రూ.70వేలు అవుతుందట. నిధుల్లేక మూలన పడేశారు. ఇక రెండు ట్రాక్టర్లలో ఒకటి తిరుగుతుండగా మరొకటి సరైన టైర్లు లేక మూలన పెట్టారు. ఆటోలకు, ట్రాక్టర్లకు 2024 జనవరి వరకు మరమ్మతులకే రూ.7లక్షలు ఖర్చయినట్లు సమాచారం. మరమ్మతులకే అంత అయితే డీజల్ కుంభకోణం ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వాహనాలు తక్కువగా ఉండడం, పుష్‌కార్టులు కూడా అంతంతమాత్రమే ఉండడంతో కొన్ని వీధుల్లో రోజూ, కొన్ని వీధుల్లో రెండు, మూడు రోజులకోమారు చెత్త సేకరణ చేస్తున్నారు. మెయిన్ రోడ్లలో మాత్రం రోజూ శుభ్రం చేస్తూ అంతా బాగుంది, ఫీల్ గుడ్ అనే భావన కలిగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఒక్కటి మాత్రమే తిరుగుతోంది..

ఎలక్ట్రికల్ వాహనాలు వచ్చిన 10రోజులకే మొరాయించడం మొదలుపెట్టాయి. గేర్స్ పడకపోవడం, బ్యాటరీ చార్జింగ్ తగ్గిపోవడం, చార్జింగ్ ఎక్కకపోవడం ఇలాంటి సమస్యలు అన్నింటికీ మొదలయ్యాయి. బ్యాటరీ మార్చాలంటే రూ.30వేలు అవుతుంది. ఈ విషయంపై కంపెనీకి ఫోన్ చేశాము. వచ్చి రిపేరీలు చేస్తామన్నారు. ఇంతవరకూ రావడంలేదు. ఒక్కటి మాత్రమే తిరుగుతోంది. ఎలక్ట్రికల్ ఆటోల బదులు మామూలు ఆటోలు పంపివుంటే బావుండేది.

\- మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, యర్రగుంట్ల

జిల్లాను టాప్ 5లో నిలపాలి

● అధికారుల సమావేశంలో కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), జూలై 25: ప్రాధాన్యత రంగాలను అన్ని విధాలా పటిష్టం చేసి రాష్ట్రంలో జిల్లాను టాప్ 5 జాబితాలో నిలపాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌సెల్ హాలులో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి ఆయా రంగాల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, పనుల పురోగతి, సాధించిన ప్రగతి తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ పరిధిలో జిల్లాలో ఖరీఫ్ సాగును పెంచడంతో పాటు అధిక దిగుబడులు సాధించేలా రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. ప్రతి రైతు సాగు చేసే పంటలకు ఈ-క్రాప్ బుకింగ్‌తో పాటు ఈకేవైసీ పూర్తిచేయాలన్నారు. ఖరీఫ్ సీజన్లో సరిపడా ఎరువులు, పురుగు మందుల కొరత లేకుండా నిల్వ ఉంచాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డులను రైతులకు ఇవ్వడమే కాకుండా వారి అవసరాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సాయిల్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్స్ నిర్వహణ పెంచాలన్నారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగు బాగా ఉందని సంబంధిత అధికారులు ఆయా పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భవిష్యత్తులో ఉద్యాన శాఖ జిల్లాకు ప్రాథమిక ఆదాయ వనరుగా మారనుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీఎంఐపీ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులకు అందేలా చూడాలన్నారు. పాడిపరిశ్రమ,పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకందార్లను ఆర్థికంగా ముందుకు నడిపేందుకు సహకారం అందివ్వాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు వ్యాక్సిన్లు వేయించాలన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు సీజన్ల వారీగా ఎరువులు, పురుగు మందులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రారెడ్డి, డీసీవో సుభాషిణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజా ఫౌండేషన్ ట్రస్టు పెద్దల నుంచి మాకు ప్రాణహాని ఉంది

● వారు అనాథల బాగోగులు పట్టించుకోవడం లేదు ● ట్రస్టు మాజీ చైర్‌పర్సన్ రాధ



పోలీసు స్టేషన్ వద్ద మాట్లాడుతున్న రాజా ఫౌండేషన్ మాజీ చైర్‌పర్సన్ రాధ, అనాథ విద్యార్థులు

ప్రొద్దుటూరు, జూలై 25: రాజా ఫౌండేషన్ ట్రస్టు పెద్దల నుంచి అనాథలైన తమకు ప్రాణహాని ఉందని, వారి నుంచి రక్షణ కల్పించాలని ట్రస్టు మాజీ చైర్‌పర్సన్ రాధ కోరారు. ఆమేరకు గురువారం ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శివప్రసాద్‌కు వారు ఫిర్యాదు చేశారు. అనంతరం రాధ పోలీస్ స్టేషన్ వెలుపల విలేకరులతో మాట్లాడుతూ.. రాజా ఫౌండేషన్ చైర్మన్ రాజారెడ్డి (డాడి) అనాథనైన తనతో పాటు ఎందరికో విద్యావసతి కల్పించి ఆదరించారన్నారు. విద్యాభ్యాసం అయ్యాక ట్రస్టులో మెంబర్లుగా చేర్చి తమను ఐదేళ్ల తీర్చిదిద్దారన్నారు. గత ఏడాది ఆగస్టు 11 వతేదిన ట్రస్టు చైర్‌పర్సన్‌గా తనను, సీఈవోగా కవితను నియమించి రిజిష్టర్ చేశారన్నారు. అదేరోజు రాత్రి రాజారెడ్డి (డాడి)ని దారుణంగా చంపేశారన్నారు. దీంతో తామంతా తీవ్ర ఆందోళనలో ఉన్నామన్నారు. అదే సందర్భంగా మిమ్మల్ను కూడా వారు చంపుతారని ట్రస్టును వేరే వారిపేర రాయించమని ప్రభాకర్ అనే ట్రస్టు సభ్యుడు భయపెట్టాడన్నారు. చిన్నజియ్యర్ చైర్మన్‌గా, బుశెట్టి రామ్మోహన్ అధ్యక్షుడుగా, గొర్రె శ్రీనివాసులు కార్యదర్శిగా, విష్ణు చిత్తన్ అనే వ్యక్తి ట్రెజరర్‌గా వారే ట్రస్టు కమిటీ రూపొందించుకుని తమతో సంతకాలు తీసుకున్నారన్నారు. మీ అనాథలందరి జీవితాలు బాగుపడతాయని చెబితే గత ఏడాది నవంబరు నెలలో వారిపేర ట్రస్టు అధికారాలను బదలాయించామన్నారు. కానీ ఆరోజు నుంచి ట్రస్టు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, అనాథల సమస్యలు వారి విద్యాభ్యాసానికి అయ్యే డబ్బులు ఇవ్వడం లేదని వాపోయారు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు పూజా ఇంటర్నేషనల్ స్కూలుకు ట్రస్టు కార్యదర్శిగా ఉన్న గొర్రె శ్రీనివాసులు వచ్చాడన్నారు. ఆయనను తాము పిల్లల చదువులకోసం డబ్బులడిగితే బండబూతులు తిడుతూ తమమీద దౌర్జన్యం చేశాడన్నారు. మిమ్మల్ను ఇక్కడి నుంచి పంపించి వేస్తానని బెదిరించారన్నారు. ఎవ్వరికి చెప్పుకుంటారో చెప్పుకోమని హెచ్చరించారన్నారు. చిన్నజియ్యర్ లాంటి పెద్దలు ఉన్నారు కదా, తమకు న్యాయం జరుగుతుందని ట్రస్టు అధికారాలను బదలాయించామని, కానీ వారు ఇలా చేస్తారని అనుకోలేదన్నారు. ఈ ట్రస్టు పెద్దల నుంచి తమకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు, జిల్లా ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

సీమలో 14 వేల ఎకరాలు కబ్జా

● జిల్లాల వారీగా న్యాయ విచారణ జరగాలి ● పీసీసీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు

కడప(కలెక్టరేట్), జూలై 25: వైసీపీ ప్రభుత్వ హయాంలో రాయలసీమ జిల్లాల్లో 14వేల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, జిల్లాల వారీగా న్యాయ విచారణ జరగాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ మైనార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీఖాన్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో 982 ఎకరాలు, కడప జిల్లాలో 3,352 మందికి చెందిన 5 వేల ఎకరాలు, కర్నూలు జిల్లాలో 856 మంది పేదలకు చెందిన 1,145 ఎకరాలు, అనంతపురంలో 3,471 మందికి చెందిన 5,554 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 103 ఎకరాలు, నంద్యాలలో 482 ఎకరాల భూములను భూ బకాసురులు నొక్కేసినట్టు అధికార గణాంకాలు చెబుతున్నాయన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వెంటనే జిల్లాల వారీగా న్యాయ విచారణకు కమిషన్లను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రంతుల్లాఖాన్, కాంగ్రెస్ నేత చిన్న కుళ్లాయప్ప, రఫీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రుణ వసూళ్లకు సమాయత్తం



● ప్రాంతాల వారీగా ప్రత్యేక బృందాలు

● 25 సొసైటీల్లో రూ.23.72 కోట్ల మొండి బకాయిలు



కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూలై 25: చేనేత సొసైటీల మొండి బకాయిల వసూళ్లకు డీసీసీ బ్యాంకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు చేనేత రంగంపై జిల్లాలో వేలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. జిల్లాలో నూలు, సిల్క్ సహకార సొసైటీలను కొంత మంది ఏర్పాటు చేశారు. ఈ సొసైటీల ద్వారా చేనేత కార్మికులకు పనికల్పించడం, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని చేనేత వస్త్రాలు తయారీ చేసేవారు. ఈ తరుణంలో అవసరమైన ముడి సరుకు కొనుగోలుతో పాటు సొసైటీ నిర్వహణకు అవసరమైన నిధుల కోసం బ్యాంకులను ఆశ్రయించేవారు. ఈ తరుణంలో డీసీసీ బ్యాంకు చేనేత సంఘాలకు రుణ సాయం అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో కోట్లాది రూపాయల రుణాలను చేనేత సహకార సంఘాలకు అందజేశారు. అయితే వాటిని తిరిగి చెల్లించడంలో కొన్ని సొసైటీల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు బ్యాంకు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి.

25 సొసైటీల్లో రూ.23.72 కోట్ల రుణం

జిల్లాలో ఉన్న 25 చేనేత సహకార సొసైటీల్లో రూ.23.72 కోట్ల మొండిబకాయిలు ఉన్నట్లు బ్యాంకు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఆరేడు సంవత్సరాల క్రితం రుణాలు తీసుకున్న సొసైటీ నిర్వాహకులు తిరిగి చెల్లించలేదు. వాస్తవానికి చేనేత సహకార సంఘాలు తీసుకున్న రుణాలు రూ.8-10 కోట్లు ఉంటుందని, అయితే వడ్డీలకు వడ్డీలు కలిపి దాదాపు రూ.23.72 కోట్లకు చేరుకున్నట్లు సమాచారం. గత ఏడాది మార్చి 31 నాటికి బ్యాంకు గణాంకాల ప్రకారం..

- జమ్మలమడుగుకు చెందిన నారాపురం వెంకటేశ్వరస్వామి వీవర్స్ సొసైటీ రూ.1.58 కోట్లు, వెంకటేశ్వర వీవర్స్ సొసైటీ రూ.1.88 కోట్లు, శ్రీలక్ష్మినారాయణ వీవర్స్ సొసైటీ రూ.1.94 కోట్లు, శ్రీహరి వీవర్స్ సొసైటీ రూ.65.78 లక్షలు, గాంధీనగర్ వీవర్స్ సొసైటీ రూ.91.64 లక్షలు, చౌడేశ్వరి సిల్క్ వీవర్స్ సొసైటీ రూ.89.77 లక్షలు, లతా వీవర్స్ సొసైటీ రూ.60.04 లక్షలు బకాయిలు ఉన్నాయి.
- మైదుకూరు హ్యాండ్‌లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ రూ.1.55కోట్లు, ఎర్రగుంట్లకు చెందిన విశ్వనాథ సిల్క్ సొసైటీ రూ.19.15 లక్షలు, మల్లేశ్వరి సిల్క్ సొసైటీ రూ.43.80 లక్షలు, ఖాజీపేట మండలం రంగాపురానికి చెందిన హనుమాన్‌సిల్క్ వీవర్స్ సొసైటీ రూ.1.11 కోట్లు బకాయిలు ఉన్నాయి.
- బద్వేలుకు చెందిన తిరువెంగళాపురం వీవర్స్ సొసైటీ రూ.1.43 కోట్లు, లక్ష్మినరసింహ వీవర్స్ సొసైటీ రూ.1.13 కోట్లు, లక్షుమ్మ బద్వేలు మహిళా హ్యాండ్‌లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ రూ.1.16 కోట్లు, లక్ష్మి మహిళా హ్యాండ్‌లూమ్ కోఆపరేటివ్ సొసైటీ రూ.1.20 కోట్లు, రంగాపురం వీవర్స్ సొసైటీ రూ.1.50 కోట్లు, సీకేదిన్నె వీవర్స్ సొసైటీ రూ.1.11 కోట్లు, అప్పారాజుపేట సొసైటీ రూ.43.31 లక్షల బకాయిలు ఉన్నాయి.
- కడప నగరం రవీంద్రనగర్‌కు చెందిన చౌడేశ్వరి హ్యాండ్‌లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ రూ.1.12 కోట్లు, మాధవరానికి చెందిన నాగమల్లిక కో-ఆపరేటివ్ సొసైటీ రూ.31.38 లక్షలు, వెంకటదుర్గా సొసైటీ రూ.42.34 లక్షలు బకాయిలు ఉన్నాయి.
- రాయచోటి ప్రాంతానికి చెందిన వంగిమళ్ల సొసైటీ రూ.33.70 లక్షలు, ఈశ్వరి మట్లి వీవర్స్ సొసైటీ రూ.31.91 లక్షలు, చౌడేశ్వరి వీరబల్లె హ్యాండ్‌లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ రూ.66.24 లక్షలు బకాయిలు ఉన్నట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారు.

వసూళ్లకు ప్రత్యేక బృందాలు

హ్యాండ్‌లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ రుణాల వసూళ్ల కోసం బ్యాంకు అధికార యంత్రాంగం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనుంది. ఈ బకాయిలు కొన్ని సంవత్సరాలుగా పెండింగులో ఉన్నాయి. 2019లో చేనేత రుణాల మాఫీకి అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రభుత్వం హామీ మేరకు తాము రుణాలు చెల్లించమంటూ కొంతమంది చేనేత సొసైటీల వారు కోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం కోర్టు బకాయిలు వసూలు చేసేందుకు తగిన సూచనలు చేసిందని, ఈ మేరకు త్వరితగతిన రుణ వసూళ్ల కోసం చర్యలు తీసుకుంటామని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులను కలిసి బ్యాంకు ఆర్థిక పరిస్థితి వివరించి రుణ వసూళ్లకు సహకారం అందించాలని కోరనున్నట్లు తెలుస్తోంది.

వసూళ్లకు చర్యలు...

చేనేత సహకార సంఘాలకు బ్యాంకు ఇచ్చిన రుణాలు తిరిగి వసూళ్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఒక్కరూ సహకరించి బ్యాంకు ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉంది.

\- రాజామణి, సీఈవో, డీసీసీ బ్యాంకు

రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు భూవివాదలపై అర్జీలు ఇస్తున్న ప్రజలు



పోటెత్తిన పెద్దిరెడ్డి భూబాధితులు

● స్పెషల్ చీఫ్ సెక్రటరీకి వందల సంఖ్యలో ఫిర్యాదులు

● ధైర్యంగా ముందుకొచ్చి బాధ వెళ్లగక్కిన బాధితులు

మదనపల్లె టౌన్, జూలై 25: మా భూమిని ఆక్రమించేశారు, మా స్థలాన్ని కబ్జా చేశారు, ప్రాజెక్టు కోసం మా భూములు బలవంతంగా లాక్కున్నారు, ప్రశ్నిస్తే నడిరోడ్డు మీద ఆడవారు అని కూడా చూడకుండా కొట్టారు...ఇలా ఒకటా రెండా వందల సంఖ్యలో పెద్దిరెడ్డి కుటుంబ బాధితులు మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో తమ గోడు వెల్లబోసుకున్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా ఆధ్వర్యంలో భూవివాదాలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ కార్యక్రమం వర్షం కారణంగా ఆలస్యమైనా, తడుస్తూనే బాధితులు క్యూలో నిల్చుని సిసోడియాకు తమ ఫిర్యాదులు, అర్జీలు అందజేశారు. వీరిలో ఎక్కువగా పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల నుంచి వచ్చిన ప్రజలే ఉన్నారు. అందులో మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వారి అనుచరులైన వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీపీల అరాచకాలను బాధితులు బయటపెట్టారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది, మా సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడానికి ఇదే సమయమని ధైర్యంగా సిసోడియా సార్‌కు కంప్లైంట్ ఇవ్వడానికి వచ్చామని బాధితులు చెప్పారు. కాగా వందలాదిగా వచ్చిన ప్రజల నుంచి భూవివాదాలు, ఇతర సమస్యలపై రెవిన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా, కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఓపికగా అర్జీలు స్వీకరించి, బాధితుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ అర్జీలన్నింటిపై విచారించి నిర్దేశిత సమయంలో పరిష్కారం చూపుతామని బాధితులకు భరోసా ఇచ్చారు.

ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు ముగిసిన కౌన్సెలింగ్

వేంపల్లె, జూలై 25: మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఒంగోలు ట్రిపుల్‌ఐటీ అడ్మిషన్ కౌన్సెలింగ్ గురువారం ముగిసింది. రెండవ రోజు డైరెక్టర్లు కుమారస్వామి గుప్త, భాస్కర్‌పటేల్ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరిగింది. మొత్తం 1035 మందికి కాల్‌లెటర్లు పంపగా 792 మంది హాజరై అడ్మిషన్లు పొందారు. మిగిలిన 242 సీట్లకు ఆగస్టు మొదటి వారంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్రకుమార్ సండ్ర తెలిపారు.

అదృశ్యం కేసులను త్వరగా ఛేదించాలి

● కంప్యూటరు పరిజ్ఞానంలో అప్‌డేట్ అవ్వాలి

● డీసీఆర్‌బీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ



డీసీఆర్‌బీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప (క్రైం), జూలై 25: మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసుల్లో దర్యాప్తు అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ కేసులు త్వరగా ఛేదించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు డీసీఆర్‌బీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణంలోని డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ) కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అప్‌డేట్ చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సంబంధిత సమాచారాన్ని తక్షణమే అందించాలని ఆదేశించారు. అందించే సమాచారం నాణ్యమైనదిగా ఉండాలని ఆదేశించారు. రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లు అప్‌డేట్‌గా ఉన్నాయా, లేదా అని పరిశీలించారు. కార్యాలయంలోని వివిధ విభాగాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలని ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సయ్యద్‌హషం, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాల కట్టడికి చర్యలు చేపట్టాలి

సైబర్ నేరాల కట్టడికి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వీలుగా విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో ఐటీ కోర్ టీం, సైబర్ సెల్, టెక్నికల్ ఎనాలిసిస్ వింగ్ విభాగాల సిబ్బంది పనితీరుపై పోలీసు అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరేట్‌కి సిఫారసు చేసిన సైబర్ నేరాల గురించి ఆరా తీశారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు సీఈఐఆర్ ద్వారా ఇప్పటి వరకు ఎన్ని రికవరీ అయ్యాయో అడిగి తెలుసుకున్నారు. విధినిర్వహణలో ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్.సుధాకర్, ఎస్‌బీ, సైబర్ క్రైం, డీసీఆర్‌బీ ఇన్‌స్పెకర్లు, ఐటీ కోర్ టీం, సైబర్ క్రైం, టెక్నికల్ ఎనాలిసిస్ వింగ్, సోషల్ మీడియా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

రెండేళ్లుగా.. రెవెన్యూ రికార్డులు లేక..!

- పరిష్కారం కాని సమస్యలు
- చేతులెత్తేసిన మండలాల అధికారులు
- ఆందోళనలో రైతులు, ప్రజలు
- ఆర్డీవో కార్యాలయంలో చిరుద్యోగి చేతివాటం

బద్వేల్ రూరల్, జూలై 25: రైతులకు సంబంధించిన భూములు, పేదల ఇంటి పట్టాలు వంటి ఎన్నో పత్రాలు రెవెన్యూ కార్యాలయంలో నిక్షిప్తమై ఉంటాయి. రైతులకు భూమి సమస్యలు వచ్చినా, పేదల ఇంటి పట్టాల సమస్యలు ఉన్నా సంబంధిత రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేస్తే.. ఆ అధికారి ధ్రువీకరణ ఆధారంగా సమస్యలు పరిష్కరమవుతాయి. అయితే బద్వేల్ రెవెన్యూ డివిజన్‌లో బద్వేల్ నియోజక వర్గానికి సంబంధించి ఏడు మండలాల్లో రెవెన్యూ రికార్డులు లేవు. దీంతో ఆయా మండలాల రెవెన్యూ కార్యాలయాల్లోకి ఏ బాధితుడు వెళ్లినా సమస్యలు పరిష్కారం కావడం లేదు. మా కార్యాలయంలో రికార్డులు లేవంటూ అధికారులు నేరుగా ఫిర్యాదుదారులకు చెప్పడం శోచనీయం.

రికార్డులన్నీ ఆర్డీవో కార్యాలయంలో..

బద్వేల్, గోపవరం అట్లూరు, పోరుమామిళ్ల, బి.కోడూరు, కలసాపాడు, కాశినాయన మండలాల్లో రెవెన్యూ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాల్లోని రికార్డులన్నీ ఆర్డీవో కార్యాలయంలో ఉన్నాయని సమాచారం. బద్వేల్ రెవెన్యూ డివిజన్ అయిన తరువాత మొదటి ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన ఆకుల వెంకటరమణ నియోజకవర్గంలో ప్రధానంగా నెలకొన్న భూ వివాదాలపై దృష్టి సారించారు. నకిలీ పట్టాల తయారు చేసే ముఠాపై ఉక్కుపాదం మోపి.. కేసులు పెట్టి జైళ్లకు పంపారు. ఆ సమయంలో రికార్డులన్నీ ఆర్డీవో కార్యాలయానికి చేర్చాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అప్పటి నుంచి అంటే.. రెండేళ్లుగా రెవెన్యూ రికార్డులన్నీ ఆర్డీఓ కార్యాలయంలోనే ఉన్నాయి.

సమస్యల పరిష్కారం ఎలా...

నకిలీ పట్టాల కేసు విషయమై ఏడు మండలాల్లోని రెవెన్యూ రికార్డులన్నీ ఆర్డీఓ కార్యాలయానికి చేరి దాదాపు రెండేళ్లు దాటింది. అయితే ఇప్పటి వరకు ఏ కార్యాలయానికి రికార్డులు తిరిగి అందలేదు. దీంతో రెవెన్యూ కార్యాలయాల పరిధిలో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించలేకపోతున్నారు. నకిలీ పట్టాల కేసు ఎప్పుడో ముగిసిపోయినప్పటికీ.. ఇంత వరకు రికార్డులు కార్యాలయాలకు చేర్చకపోతే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

చిరుద్యోగి చేతి వాటం..

ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న ఏడు మండలాల రికార్డులతో గతంలో ఓ చిరుద్యోగి చేతి వాటం ప్రదర్శించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకున్నాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం కూడా మరో చిరుద్యోగి రికార్డులతో చేతివాటాన్ని ప్రదర్శించి సమస్యలతో వచ్చిన బాధితుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అప్పటి ఆర్డీఓ బదిలీపై వెళ్లి.. మరో ఇన్‌చార్జి ఆర్డీఓ బాధ్యతలు చేపట్టిన తరుణంలో రెవెన్యూ కార్యాలయాలకు రికార్డులు చేర్చి సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.


బద్వేల్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం

ఆర్డీవో ఆఫీసుకు సరెండర్ చేశాం..

రెండు సంవత్సరాల క్రితం నకిలీ పట్టాల కేసు విషయంలో డీకేటీ పట్టాలు, ఇంటి పట్టాలకు సంబంధించిన రికార్డులన్నీ ఆర్డీవో ఆఫీసుకు సరెండర్ చేశాం. ప్రస్తుతం రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు లేవు.

– మనోహర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు, బద్వేలు

భూ కబ్జాలపై విచారణ చేపట్టాలి : సీపీఐ

బద్వేలు, జూలై 25: వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఆ పార్టీ నేతలు వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. భూకబ్జాలపై విచారణ చేపట్టి.. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ గురువారం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి.. ఆర్డీఓ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ వైసీపీ హయాంలో కాశినాయన మండలం నుంచి అట్లూరు మండలం వరకు సుమారు 30 వేల ఎకరాలు కబ్జా చేసి బినామీ పేర్లతో నకిలీ పట్టాలతో అక్రమంగా ఆన్‌లైన్ కూడా చేయించుకున్నారన్నారన్నారు. రీ సర్వే పేరుతో వేలాది ఎకరాలు రాత్రికి రాత్రే తారుమారు చేశారని, తక్షణం కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కాశినాయన మండలంలోని 55, 106, 121, 130, 132, 133తో పాటు అనేక సర్వే నెంబర్లలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి 250 ఎకరాలు బినామీ పేర్లతో పట్టాలు సృష్టించి ఆన్‌లైన్ కూడా చేయించుకున్నారన్నారు. కలసపాడు మండలం రామాపురంలో భూ ఆక్రమణలు జరిగాయన్నారు. పోరుమామిళ్ల మండలం పోరుమామిళ్ల, రామేశ్వరం, పెద్దచెరువు, యల్లారెడ్డిపేట, క్రిష్టంపల్లి చెరువులను ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారన్నారు. బద్వేలు, గోపవరం మండలాల్లోని గోపవరం తహసీల్దారు కార్యాలయం ఎదురుగానే 64, 65, 119/ఎ,బి సర్వేనెంబర్లలో నకిలీ పట్టాలు పొందికోట్ల రూపాయలు విలువైన భూములను ఆక్రమించారన్నారు. మడకలవారిపల్లె, బద్వేలు మండలంలోని సి.కొత్తపల్లె, అట్లూరు మండలం కొండూరు తదితర ప్రాంతాల్లో వైసీపీ హయాంలో భారీ ఎత్తున ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని.. వాటిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు, రమణ, ఇమ్మానుయేల్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.


బద్వేలు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

కౌలు సాగుకు కార్డు తప్పనిసరి

- జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

రామాపురం, జూలై 25: భూమి కౌలుకు తీసుకొనే రైతులు పంటలు సాగు చేసుకునేందుకు పత్రం, కార్డు తప్పనిసరిగా ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె వ్యవసాయ క్షేత్రంలో గురువారం రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి భూమిని కౌలుకు తీసుకొని సాగు చేసుకునే రైతులు కార్డు పొంది ఉంటే రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతాయన్నారు. పీయం కిసాన్ పథకానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి ఈకేవైసీ పూర్తి చేయించాలన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించి.. సాగురైతుల సంఖ్యను పెంచి పనితీరును మెరుగుపర్చాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం పొలంలో ఆయన సందర్శించి లింగాకర్షక బుట్టలు, పసుపు పల్లెముల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారిణి నాగమణి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలిస్తున్న చంద్రానాయక్

డ్రగ్స్‌రహిత సమాజం నిర్మించుకుందాం..

- యువతను చైతన్యం చేయడం అభినందనీయం - కలెక్టర్

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 25 : గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య ముద్రించిన ఓ యువత డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడదాం అనే పోస్టరును కలెక్టర్ లోతేటి శివశంకర్ గురువారం ఆవిష్కరించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడంలో యువత భాగస్వామ్యం కావాలని జీఆర్ఎస్‌వైఎఫ్ యువతను చైతన్యం చేయడం అభినందనీయమన్నారు. నేటి ఆధునిక సమాజంలో అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన యువత మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారన్నారు. ఇది ప్రస్తుత సమాజానికి ప్రమాదకరమన్నారు. డ్రగ్స్‌రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. జీఆర్ఎస్‌వైఎఫ్ డీఎం ఓబులేసుయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిక్, సాయి, నవీన్, నాగమల్లేశ్, హరి పాల్గొన్నారు.



పోస్టరు ఆవిష్కరణ చేస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

వైవీయు ఆర్ట్స్ విభాగ డీన్‌గా ప్రొఫెసరు గంగయ్య

కడప (ఎడ్యుకేషన్), జూలై 25: యోగివేమన విశ్వవిద్యాలయ ఆర్ట్స్ విభాగ డీన్‌గా చరిత్ర పురావస్తుశాఖ ప్రొఫెసర్‌గా కంకణాల గంగయ్య నియమితులయ్యారు. నియామకపు పత్రాన్ని వైవీయు వీసీ ఆచార్య కె.క్రిష్ణారెడ్డి, కుల సచివులు ఆచార్య ఎస్.రఘునాథరెడ్డితో కలిసి తన ఛాంబరులో అందించారు. ఇది వరకు డీన్‌గా పనిచేస్తున్న తెలుగుశాఖ ఆచార్యులు టి.రాంప్రసాద్‌రెడ్డి పదవీ కాలం పూర్తవడంతో ఈ నూతన నియామకం చేపట్టారు. ఆచార్య కంకణాల గంగయ్యను పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, స్కాలర్లు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

పోయిన నగదు బాధితులకు అప్పగింత

నందలూరు, జూలై 25: పోయిన నగదును బాధితులకు పోలీసు లు అప్పగించిన సంఘటన గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో చోటు చేసుకుంది. ఈసం ఘటనపై ఎస్‌ఐ మహ్మద్ అబ్దుల్‌జహీర్ మాట్లాడుతూ కడపకు చెందిన మల్లు దివాకర్ తిరుపతి నుంచి కడపకు వెళుతూ నందలూరులో టీ తాగేందుకు దిగుతుండగా.. రూ.90 వేల నగదు ఉన్న పర్సు కింద పడిపోయింది. అది గమనించనివారు కడపకు వెళ్లి చూసుకోగా పర్సు కనపడకపోవడంతో నందలూరుకు వచ్చి పోలీసులను ఆశ్రయించారు. వారు సీసీ కెమెరాలు పరిశీలించి ఒక వ్యక్తికి ఆపర్సు దొరికినట్లు నిర్ధారించారు. అతనిని నుంచి నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మలమడుగు, జూలై 25: జమ్మలమడుగులో పలు గ్రామాల నుంచి రాత్రి, పగలు ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పట్టణంలో అర్బన్ పోలీసు సిబ్బంది నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. అర్బన్ పోలీసు స్టేషన్‌కు తరలించి.. చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు అప్పజెబుతున్నట్లు ఏఎస్‌ఐ మురళీయాదవ్ తెలిపారు.

46 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం


సంచులు మార్చి లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని లక్కిరెడ్డిపల్లె గోడౌన్‌లో దించుతున్న వైనం

లక్కిరెడ్డిపల్లె/రామాపురం, జూలై 25: రామాపురం మండలంలోని గువ్వలచెరువు చెక్ పోస్టువద్ద పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించి.. బద్వేల్ నుంచి కర్ణాటకు తరలిస్తున్న రెండు లారీల్లోని 46 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని లక్కిరెడ్డిపల్లె నిత్యావసర సరుకుల గోడౌన్‌కు తరలించారు. జిల్లా మేనేజర్ శ్రీనివాసమూర్తి, డీఎస్‌ఓ రఘురాంలు సంఘటనా స్థలానికి చేరుకొని విషయంపై ఆరా తీశారు.

ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని గోనే సంచుల నుంచి మార్చి ప్లాస్టిక్ సంచులలో తరలిస్తున్నారని సమాచారం రావడంతో రామాపురం ఎస్‌ఐ లక్ష్మిప్రసాద్ రెడ్డి తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. బద్వేల్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తుండగా 850 బస్తాల రేషన్ బియ్యాన్ని, రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీ కృపావతి తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని గోపగుడిపల్లె గ్రామ వీఆర్వో చిన్నసాగర్, ఎన్‌ఫోర్స్ మెంటు డీటీ కృపావతి లక్కిరెడ్డిపల్లె గోడౌన్‌కు తరలించి తూకాలు వేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు రామాపురం పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ.. బ్యాంకు అసిస్టెంటు మేనేజరు మృతి

కడప (క్రైం), జూలై 25 : కడప నగరం శంకరాపురం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సెంట్రల్ బ్యాంకు అసిస్టెంటు మేనేజరు గిద్దలూరు వెంకటరమణ (44) మృతి చెందాడు. చిన్నచౌకు ఎస్‌ఐ రవికుమార్ వివరాల మేరకు.. కడప నెహ్రూనగర్‌కు చెందిన వెంకటరమణ కడపలోని సెంట్రల్‌బ్యాంకు అసిస్టెంటు మేనేజరుగా పనిచేస్తున్నాడు. మృతుడు అంధుడు అని.. సొంత పని నిమిత్తం కూతురుతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా శంకరాపురం వద్ద టర్నింగ్ తీసుకుంటుండగా మరో ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆయనను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా.. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కడప (క్రైం), జూలై 25 : కడప నగరం ఆర్టీసీ బస్టాండు వద్ద 24న బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి వయసు 50 సంవత్సరాలు ఉంటుందని, ఎవరైనా ఆచూకీ తెలిస్తే 9121100520, 9121100521 సెల్ నెంబర్లకు ఫోను చేసి సమాచారం అందించాలని సీఐ నరసింహారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

సికెదిన్నె, జూలై 25: మండలంలోని వేపమాను సత్రం వద్ద ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుకవైపు నుంచి ఢీకొనడంతో రాజేంద్రన్ ధర్మలింగం (50) అనే వ్యక్తి మృతి చెందినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. వివరాలిలా.. తమిళనాడు రాష్ట్రం ఏలూరు జిల్లా పల్లికొండ గ్రామానికి చెందిన రాజేంద్రన్ మరో డ్రైవర్ హరికిషన్‌తో కలిసి మహరాష్ట్రకు వెళ్లి..తిరిగి ఏలూరుకు వస్తుండగా గురువారం తెల్లవారుజామున ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురు కళ్లలో పడటంతో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. దీంతో రాజేంద్రన్ ధర్మలింగం రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. 108లో రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైవీయూ ప్రొఫెసర్‌కు ప్రతిష్టాత్మక బ్రెయిన్ పూల్ ఫెలోషిప్

కడప (ఎడ్యుకేషన్), జూలై 25: నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆఫ్ కొరియా 2024 అత్యుత్తమ విదేశీ పరిశోధకులకు అందించే బ్రెయిన్‌పూల్ ఫెలోషిప్ వైవీయూ మెటీరియల్స్ సైన్స్ నానోటెక్నాలజీ ప్రొఫెసరు ఎంవీ శంకర్‌కు లభించింది. దక్షిణ కొరియాలోని ప్రపంచ ర్యాంకింగ్ సంస్థ కొంకుక్ యూనివర్శిటీలో పనిచేయడానికి ఈయనను ఆహ్వానించింది. ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన 81 మంది సభ్యుల్లో ఆయన ఒకరు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ రఘునాథ రెడ్డి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న విశ్వవిద్యాలయం నుంచి యువ అధ్యాపకులు ప్రపంచ ప్రతిష్టాత్మక ఫెలోషిప్ పొందడం ప్రశంసనీయం అన్నారు. విశ్వవిద్యాలయం పరిశోధనలు చేయడానికి అవసరమైన సమగ్ర సహాయాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. కాగా, వైవీయూ ప్రొఫెసరు శంకర్ పరిశోధన, అకడమిక్ ఆధారంతో పాటు అంతర్జాతీయ శాస్త్రీయ సమాజంలో అత్యుత్తమ ప్రభావవంతమైన శాస్త్రవేత్తల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. అతను 2020, 21, 22, 23 సంవత్సరాల్లో మెటీరియల్స్ అండ్ ఎనర్జీ రంగంలో ప్రపంచంలోని మొదటి ఇద్దరిలో అత్యంత ప్రభావంతమైన శాస్త్రవేత్తల జాబితాలో నిలిచారు. పరిశోధనలకు గుర్తింపుగా వివిధ శాస్త్రీయ సంస్థల నుంచి గ్రాంట్లు లభించాయి. 2022 సంవత్సరం యూకే (ఎఫ్ఆర్ఎస్‌సీ)లో ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ పురస్కారం అందుకున్నారు. స్కోపస్ ఇండెక్స్ జర్నల్స్‌లోని పరిశోధన ప్రచురణ ఆధారంగా గత నాలుగేళ్లలో ఈయన అద్భుతమైన పరిశోధన పత్రాలు రాశారు. ముఖ్యంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, కాలుష్య కారకాల క్షీణత, స్థిరమైన వాతావరణం పరిశోధనలతో ప్రతిష్టాత్మకమైన అవార్డులతో పాటు ఆచార్య శంకర్‌కు ప్రత్యేక గుర్తింపును సంపాదించి పెట్టాయి. కార్యక్రమంలో డీన్ ఆచార్య కంకణాల గంగయ్య, సీఈ ఆచార్య ఎస్ ఈశ్వర్‌రెడ్డి, ఆచార్య ఎజీ దాము, ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి, సహా ఆచార్యులు డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ శ్రీధర్‌బాబు, అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ టి.సురేశ్‌బాబు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ ఎంవీ శంకర్‌ను అభినందిస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు రఘునాథరెడ్డి తదితరులు

కార్గిల్ ద్వారా పాకిస్థాన్ పీచమణిచిన భారత్

- బీజేపీ, బీజేవైఎం నాయకులు

కడప (మారుతీనగర్), జూలై 25: భారత్‌లో అంతర్భాగమైన కాశ్మీర్‌ను రక్షించుకునే క్రమంలో శత్రుదేశ పాకిస్థాన్‌ను పీచమణిచేవిధంగా 25 సంవత్సరాల క్రితం జరిగిన కార్గిల్ యుద్ధంలో మన సైన్యం నిరూపించిన సంగతి తెలిసిందే అని బీజేపీ, బీజేవైఎం నాయకులు అన్నారు. కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళి అర్పించే క్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా బీజేవైఎం పిలుపుమేరకు కాగడాల ప్రదర్శన చేపట్టారు. అందులో భాగంగా బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు కాగడాల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాలక్రిష్ణయాదవ్, బీరం సుబ్బారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ మాట్లాడారు. కాశ్మీర్‌లో అంతర్భాగమైన కార్గిల్‌ను పాకిస్థాన్ ఆక్రమించుకునేందుకు సాగినపోరులో భారత్ 1999లో తిరుగులేని విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, మునగా సతీష్‌కుమార్, ఓబులేసు, డాక్టర్ జయశ్రీనివాస్, బీజేవైఎం నగర అధ్యక్షుడు మాచునూరు హరికృష్ణ, నాయకులు రంగప్రసాద్, అమర్‌నాథ్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కాగడాల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


మాట్లాడుతున్న అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత గంగిరెడ్డి, హాజరైన విద్యార్థులు

సికెదిన్నె, జూలై 25: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని.. వాటి సాధనకు కృషి చేయాలని అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి పేర్కొన్నారు. కడప నగరం రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా తమ విద్యాసంస్థలు పనిచేస్తున్నాయన్నారు. ఇంజనీరింగ్ విద్యలో అనేక అవకాశాలు ఉన్నాయని.. తల్లిదండ్రులు మంచి కళాశాలను ఎంపిక చేసుకోవడంలో వారి విజయం సగం సాధించినట్లు అన్నారు. విద్యాసంస్థల వైస్‌చైర్మన్ చొప్పా యల్లారెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువ ఇంజనీర్ల పాత్ర కీలకమని.. ఎంత కష్టపడి చదివితే అంతకు రెట్టింపు ఫలితం ఉంటుందన్నారు. నాలుగు సంవత్సరాలు కష్టపడి 80 సంవత్సరాలు సుఖంగా జీవించాలని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించేందుకు అర్హత, అనుభవం కలిగిన అధ్యాపక సిబ్బందిని నియమించామన్నారు. ఏవో రామసుబ్బారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం..

కమలాపురం రూరల్, జూలై 25: మండల పరిధిలోని నసంతపురం గ్రామంలో ఈ నెల 6న వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వ్యాధులు ప్రబలకుండా కొంత మంది చిన్నారులకు టీకాలు వేశారు. ఆ సందర్భంలో రెండు నెలల చిన్నారికి టీకా వేయగా మృతి చెందిన సంఘటన విదితమే. జరిగిన సంఘటనపై కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసరు డాక్టర్ ఉమామహేశ్వర్ నేతృత్వంలో రిమ్స్‌కు చెందిన ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎన్‌సీహెచ్ రాజేష్‌క్రిష్ణ, డాక్టర్ ఎన్.నాగసుధారాణి, డాక్టర్ ఎస్.సుధాకర్, డాక్టర్‌వి.లక్ష్మీదేవి, డాక్టర్ ఎస్‌ఎండీ సాజిద్‌బాషాల బృందం నసంతపురం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాలునికి వ్యాక్సిన్ వేయకముందు, వేసిన తరువాత జరిగిన పరిణామాలను తల్లిదండ్రులు అనిత, రాజు ఇతర కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐవో ఉమామహేశ్‌కుమార్ మాట్లాడుతూ బాలుడి మృతిపై విచారణ చేశామని, నివేదికను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో పెద్దచెప్పలి మెడికల్ ఆఫీసరు ప్రసూన, డ్రగ్స్ ఇన్స్‌పెక్టరు మాధవీ, ఎపిడమయొలజిస్ట్ ఖాజామొహిద్దీన్, సీహెచ్ మునిరెడ్డి పాల్గొన్నారు.


మృతి చెందిన బాలుని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విచారణ బృందం

అంగన్వాడీ కేంద్రంలో వసతుల లేమి

● దెబ్బతిన్న జారుడు బల్ల ● పనికిరాని మరుగుదొడ్లు ● ఆందోళనలో చిన్నారుల తల్లిదండ్రులు

చెన్నూరు, జూలై 25 : చెన్నూరు మండలం ఉప్పరపల్లె దళితవాడలోని అంగన్వాడీ కేంద్రంలో వసతులు సరిగా లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉప్పరపల్లె పంచాయతీలో మూడు అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, అందులో దళితవాడలోని అంగన్వాడీ కేంద్రం అత్యంత దారుణంగా ఉంది. 15 మంది చిన్నారులు ఉన్న ఈ కేంద్రంలో వసతులు సరిగా లేవు. అంగన్వాడీ కేంద్రం బ య ట పిల్లలు ఆడుకునే జారుడు బల్ల పూర్తిగా దెబ్బ తింది. ఇనుప రేకు కాబట్టి తుప్పు బట్టి విరిగింది. చిన్నారులు చేతులతో పట్టుకుంటే చేతులు కోసుకుపోయేట్లు ఉంది. ఇక్కడ రెండు మరుగుదొడ్లు ఉండగా ఒకటి పూర్తిగా పనికిరాకుండా పోగా, మరొకదాంట్లో రాళ్లు వేసి నిరుపయోగంగా చేశారు. అంగన్వాడీ కేంద్రం బయట ప్రహరీకి పక్కన నీటి పథకానికి సంబంధించిన కరెంటు మీటరు మూడు అడుగుల ఎత్తులో బిగించి ఉన్నారు. చిన్నారులు అక్కడికి వెళ్లి పొరపాటున చేయి తాకితే దాని వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తమ చిన్నారులు అంగన్వాడీ కేంద్రం వెళితే అక్కడ ఉన్న పరిస్థితులతో ఎక్కడ గాయాలవుతాయోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోపోతే కేంద్రానికి తమ పిల్లలను పంపి ఇబ్బందులు కొని తెచ్చుకోలేమని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.



ఉప్పరపల్లె దళితవాడ అంగన్వాడీ కేంద్రం వద్ద గోడకు ఏర్పాటు చేసిన నీటి పథకం స్విచ్‌బోర్డు



నిరుపయోగంగా మారిన మరుగుదొడ్డి



అంగన్వాడీ కేంద్రంలో తప్పుబట్టి విరిగిన జారుడు బల్ల

ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపాం

ఉప్పరపల్లె దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో నెలకొన్న సమస్యలపై గతంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపాం. గత పాలనలో గడప గడపకూ వైసీపీ కార్యక్రమంలో గత ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు కాలేదు. మరుగుదొడ్లు లేని మాట వాస్తవమే. జారుడుబల్ల దెబ్బతింది నిజమే. దానికి నిధులు ఇవ్వకుంటే ఏం చేయాలి. పలుమార్లు చెప్పినా వింటున్నారే తప్ప సమస్యలు తీర్చడానికి నిధులు మంజూరు చేయలేదు. దీంతో చిన్న పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. త్వరగా సమస్యను పరిష్కరించాలి.

- నాగరత్న, అంగన్వాడీ సూపర్‌వైజరు

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ



చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప (క్రైం)/సీకే దిన్నె, జూలై 25: జూలై 25 : పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సిబ్బందికి సూచించారు. గురువారం కడప నగరంలోని రిమ్స్‌ చిన్నచౌకు, చింతకొమ్మదిన్నె పోలీసుస్టేషన్లను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా పోలీసుస్టేషన్లలోని రికార్డులను పరిశీలించారు. నూతనంగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్)పై అవగాహన పెంపొందించుకోవాలని పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. ఫిర్యాదుదారులతో గౌరవంగా మాట్లాడి వారి సమస్యల ను అడిగి తెలుసుకోవాలన్నారు. సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు విస్తృంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రిమ్స్‌ పోలీసుస్టేషన్‌ నగర శివారులో ఉన్న నేపథ్యంలో బహిరంగ మద్యపానం జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సెలవు దినాల్లో ఎక్కువగా ప్రజలు సందర్శించే నగర వనం పరిసర ప్రాంతాల్లో గస్తీ ముమ్మరంగా చేయాలన్నారు. పోలీసుస్టేషన్‌ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే చోరీలు జరగకుండా పోలీసు గస్తీ ముమ్మరం చేయాలన్నారు. విజిబుల్‌ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజూ కాలనీలను సందర్శించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌ యు.వెంకటకుమార్‌, రిమ్స్‌ పీఎస్‌ సీఐ కె.రామచంద్ర, చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి, సీకేదిన్నె సీఐ శంకర్‌నాయక్‌, ఒంటిమిట్ట ఎస్‌ఐ మధుసూదన్‌రావు ఉన్నారు.

నీతి వాక్యాలు కాదు.. పనులు చేయండి

● గ్రామసభలో సర్పంచ్‌, కార్యదర్శులను ప్రశ్నించిన ప్రజలు



గ్రామ సభలో మాట్లాడుతున్న ఈఓఆర్‌డీ సురేశ్‌బాబు.. హాజరైన ప్రజలు

చెన్నూరు, జూలై 25 : నీతి వాక్యాలు చెప్పడం కాదు.. ప్రజలకవసరమైన పనులు చేయాలని ప్రజలు పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డిని, సర్పంచ్‌ వెంకటసుబ్బయ్యను ప్రశ్నించారు. గురువారం చెన్నూరు పంచాయతీ గ్రామసభ సర్పంచ్‌ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నేత సుధీర్‌రెడ్డి, వార్డు సభ్యుడు కల్లూరు ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త రోడ్డుపై బస్సుషెల్టరు లేదని, మురుగుకాలవలు లేవన్నారు. బస్‌షెల్టరు లేకపోవడంతో ఇటీవల ఓ వృద్ధురాలు బస్సుకోసం వచ్చి ఎండ వేడిమికి తాళలేక స్పృహ తప్పి పడిపోయిందన్నారు. బస్సు కోసం వచ్చిన వారు దుకాణాలు, మాంసం కొట్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దోమల నివారణకు మందుకొట్టించిన దాఖలాలు కూడా లేవన్నారు. గ్రామ నేత వీరారెడ్డి మాట్లాడుతూ చెన్నూరు పాత బస్టాండు సమీపంలో ఐదో వార్డు స్కూలు గేటు ముందు వ్యర్థాలు వేస్తున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ హైవేపై బస్‌షెల్టరు, మురుగుకాల్వలకు ప్రతిపాదనలు పంపామని, ఇంత వరకు ఎలాంటి స్పందన లేదన్నారు. ఈఓఆర్‌డీ సురేశ్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వాడాలని, చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయవద్దన్నారు. ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. కాగా గ్రామ పంచాయతీలో 20 మంది వార్డుసభ్యులు ఉండగా ఇందులో నలుగురు మాత్రమే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్‌ ఏఈ వినోద్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఉర్దూ డీఎస్సీ నిర్వహణపై మంత్రికి వినతి

చెన్నూరు, జూలై 25 : రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించే డీఎస్సీలో ఉర్దూ డీఎస్సీని ప్రత్యేకంగా నిర్వహించాలని ఖిద్మతే ఖల్క్‌ వ్యవస్థాపకుడు గయాజ్‌ అహ్మద్‌ రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌కు వినతిపత్రం అందించారు. తాడేపల్లి సచివాలయంలోని మైనార్టీ శాఖా మంత్రి చాంబరులో ఆయన్ను కలిసి విన్నవించారు. అలాగే కడప నగరం చెన్నూరు మండల పరిధిలోని హజ్‌హౌస్‌లో సెంటర్‌ ఫర్‌ ఎడ్యుకేషన్‌ డెవలప్‌మెంటు ఆఫ్‌ మైనార్టీస్‌ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

బాలాజీ ఆలయ హుండీ లెక్కింపు

కడప (కల్చరల్‌), జూలై 25: కడప నగర గడ్డిబజార్‌లో వెలసిన సోమసుందరేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ జనార్ధన్‌, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్‌, హాజరయ్యారు. ఆ మేరకు గత మార్చి 30వ తేదీ నుంచి ఈనెల 25 వరకు స్వామివారి దర్శనానికి హాజరైన భక్తులు కానుకల రూపంలో హుండీలో సమర్పించిన ఆదాయంగా రూ.16,559 ఆదాయం వచ్చినట్లు నిర్ధారించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది., భక్తులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపితే శిక్ష

సీకేదిన్నె, జూలై 25: మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదని సీఐ శివశంకర్‌నాయక్‌ హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో తమటం పురుషోత్తంరెడ్డి అనే వ్యక్తికి 15 రోజులు జైలు శిక్ష, రూ.2,500 జరిమానా కోర్టు విధించినట్లు సీఐ తెలిపారు. ఈనెల 11న మద్యం సేవించి స్కూటర్‌ నడిపినందున పోలీసు తనిఖీల్లో బ్రీత్‌ అనలైజర్‌లో పట్టుబడగా గురువారం కోర్టు తీర్పు వెలువడిందని, దీని ప్రకారం సాక్షాధారాలతో సహా రుజువు కావడంతో శిక్ష విధించినట్లు తెలిపారు.

గ్రామంలో మురుగు నీరు లేకుండా చూడాలి

వల్లూరు, జూలై 25 : వర్షాకాలంలో గ్రామంలో ఎక్కడా మురుగునీరు పారకుండా చూడాల్సిన బాధ్యత గ్రామంలో ప్రజలందరిపై ఉందని దిగువపల్లె సర్పంచ్‌ కుళ్లాయప్ప అన్నారు. గురువారం దిగువపల్లె గ్రామ పంచాయతీలో గ్రామ సచివాలయ సిబ్బంది స్థానిక గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యదర్శి లక్ష్మీదేవి, మాజీ ఎంపీటీసీ రమణారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, శివారెడ్డి, ఓబుల్‌రెడ్డి, కిశోర్‌, సచివాలయ వెల్ఫేర్‌ అసిస్టెంటు భాను, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు డయల్‌ యువర్‌ డీఎం

పులివెందుల టౌన్‌,జూలై 25: శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోనందు డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పులివెందుల డిపో మేనేజర్‌ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుందన్నారు. 9959225780కు ఫోన్‌ చేసి సమస్యలు తెలియజేయవచ్చు అన్నారు. అలాగే 9959225780 నెంబర్‌కు వాట్సప్‌ చేసి సమస్యలను మెసేజ్‌ చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులను కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఉన్నతాధికారులు

కడప(కలెక్టరేట్‌), జూలై 25: కలెక్టర్‌ లోతేటి శివశంకర్‌ను గురువారం సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రాంతీయ సంచాలకులు ఎస్‌. మహబూబ్‌ బాషా మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే కలెక్టర్‌ను వైవీయూ ఇన్‌చార్జ్‌ వైస్‌ చాన్సలర్‌ డాక్టర్‌ కృష్ణారెడ్డి, ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ యూనివర్సిటీ ఇన్‌చార్జ్‌ వైస్‌ చాన్సలర్‌ డాక్టర్‌జి. విశ్వనాథకుమార్‌ కలిసి పూల మొక్కను అందజేశారు.

ఫసల్‌ బీమా పాతపద్ధతిలో అమలు చేయాలి

వేంపల్లె, జూలై 25: ప్రధానమంత్రి ఫసల్‌ బీమా పథకాన్ని పాతపద్ధతిలోనే అమలు చేయాలని వైసీపీ రైతు విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అమలు చేయాలని కోరారు. జూలై 31లోగా బీమా ప్రీమియం చెల్లించేందుకు గతంలో గడువు ఉండేదని తెలిపారు. జిల్లాలోని మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చొరవ తీసుకొని రైతులకు మేలు జరిగేల ఫసల్‌ బీమాను అమలు చేయాలని ఆయన కోరారు.

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలి

కమలాపురం రూరల్‌, జూలై 25 : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అలవరచుకోవఆలని డీఈవో అనురాధ తెలిపారు. గురువారం జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాల ప్లస్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8 మరియు 10 తరగతి విద్యార్థుళతో సమావేశం నిర్వహించి వారికి చదువు పట్ల అవగాహన, దిశ నిర్దేశనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి చదవి మంచి మార్కులు సాధించాలన్నారు. పదోతరగతి విద్యార్థులు ప్రతి రోజూ ఎక్కువ భాగం చదువుకే వినియోగించుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు.

అటల్‌ టింకరింగ్‌ ల్యాబ్‌ ఎంతో ఉపయోగం

వల్లూరు, జూలై 25: విద్యార్థులకు అటల్‌ టింకరింగ్‌ ల్యాబ్‌ ఉప యోగపడుతుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ సురేశ్‌బాబు తెలిపారు. గత మూడురోజులుగా తమ ల్యాబ్‌లో విద్యార్థులు చేసిన సైన్స్‌ ప్రాజెక్టులను గురువారం ప్రదర్శించినట్లు ఆయన తెలిపారు. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం వికసింపజేయడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు పాఠ్యప్రణాళికలో భాగంగా తమ సైన్స్‌ ఉపాధ్యాయులు చెప్పిన వాటిని ఈ ల్యాబ్‌లో స్వతహాగా నిర్వహించుకోవచ్చన్నారు. వారు నేర్చుకున్న అంశాలను ఈ ల్యాబ్‌ ద్వారా చేయడంతో సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ ఎం.వెంకటనారాయణ, లక్ష్మీనారాయణ, ప్రొఫెసరు మహేశ్‌నాయక్‌, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యాసదస్సును జయప్రదం చేయండి'

కడప (ఎడ్యుకేషన్‌), జూలై 25 : ఏపీ ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్‌ యూటీఎఫ్‌ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఆదివారం ఉదయం 10గంటలకు జరగబోయే రాష్ట్ర స్థాయి విద్యాసదస్సును జయప్రదం చేయాలని యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు కోరారు. గురువారం సాయంత్రం రాష్ట్ర విద్యా సదస్సుకు సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం యూటీఎఫ్‌ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్‌ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తికావస్తున్న సందర్భంగా రాష్ట్రమంతటా స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా వివిధ జిల్లాల్లో సమకాలీన అంశాలపై రాష్ట్రస్థాయి సదస్సులు నిర్వహించి ఉపాధ్యాయులను చైతన్యపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎజాజ్‌ అహ్మద్‌, ఆడిట్‌ కమిటి కన్వీనరు ప్రభాకర్‌, నాయకులు గోపినాద్‌, వీరనారాయణ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వేంపల్లె, జూలై 25: ప్రమాదంలోను, అనారోగ్యంతో ఉన్న వారికి రక్తదానం చేయడం అంటే ప్రాణాన్ని రక్షించడమే అని ఎంపీడీఓ దివిజ తెలిపారు. రక్తదాన వారోత్సవాల్లో భాగంగా వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. నెహ్రూయువ కేంద్రం, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటుచేశారు. 35 మంది రక్తదానం చేశారు. పశువైద్యాధికారి సాదిక్‌బాష, కళాశాల ప్రిన్సిపల్‌సత్యనారాయణశెట్టి, విజయ్‌కుమార్‌, రాజు, శివకృష్ణ, తేజ, రెడ్‌క్రాస్‌ స్పెషలాఫీసర్‌ శివశంకర్‌, నెహ్రూయువకేంద్రం కోఆర్డినేటర్‌ హేమంత్‌కుమార్‌, సుబ్బయ్య, లావణ్య, గుర్రప్ప పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించాలి

సీకేదిన్నె, జూలై 25: రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించాలని వ్యవసాయాధికారి ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో వెజా ఫార్మర్స్‌ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంతో పోటీ పడి ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానం ఉపయోగించి దిగుబడులు పెంచుకోవాలన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

● కడప నగరంలో వారం రోజుల పాటు పోలీసు స్పెషల్‌ డ్రైవ్‌



కడప నగరంలో స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్న పోలీసులు

కడప (క్రైం), జూలై 25 : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని కడప ఇన్‌చార్జ్‌ డీఎస్పీ సుధాకర్‌ హెచ్చరించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కడప నగరంలో వారం రోజుల పాటు రాత్రి సమయంలో స్పెషల్‌ డ్రైవ్‌ ఉంటుందన్నారు. బ్లూకోల్ట్స్‌, స్పెషల్‌ పార్టీ సిబ్బంది మొత్తం 50 మందితో ముమ్మరంగా వాహనాల తనిఖీలు, నైట్‌ పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్పెషల్‌ డ్రైవ్‌లో కడప వన్‌టౌన్‌ సీఐ భాస్కర్‌రెడ్డి, టూటౌన్‌ సీఐ ఇబ్రహీం, కమాండ్‌ కంట్రోల్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. నిర్ణీత సమయానికి షాపులు మూసివేయాలని, రోడ్లపై రాత్రిపూట అనవసరంగా తిరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తమ వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌ డాక్యుమెంట్లు, లైసెన్సు తమ వద్ద ఉంచుకోవాలన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ ధరించాలి

● సీనియర్‌ సివిల్‌ జడ్జి బాబాఫక్రుద్దీన్‌

కడప(రూరల్‌) జూలై 25 : వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్‌ ధరించాలని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎస్‌. బాబాఫక్రుద్దీన్‌ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని బిల్టప్‌ సర్కిల్‌ నుంచి రెండవ గాంధీ విగ్రహం వరకు హెల్మెట్‌ వాడకంతో ఉపయోగాలపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మనల్ని, మన కుటుంబాన్ని రక్షించుకోవాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ ధరించాలన్నారు. ఐఎస్‌ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్‌ను వాడాలన్నారు. అలాగే రోడ్డు భద్రత నియమావళిని పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు, పిలియన్‌ డ్రైవర్లు హెల్మెట్‌ ధరించకుండా వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమన్నారు. కాగా జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు డీఎల్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో గురువారం కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్‌ కళాశాల నుంచి పులివెందుల రోడ్డు సర్కిల్‌ వరకు ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు హెల్మెట్‌ వాడకంపై అవగాహన కల్పించారు. కడప రూరల్‌ సీఐ శంకర్‌నాయక్‌, న్యాయవాదులు, పోలీస్‌ అధికారులు, విద్యార్థులు, పారాలీగల్‌ వాలంటీర్లు, ప్యానల్‌ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ఎన్జీఓలు పాల్గొన్నారు.

'డీఎస్‌ఏ మైదానంలో హ్యాండ్‌ బాల్‌ కోర్టుకు చోటు కల్పించండి'

కడప (నాగరాజుపేట), జూలై 25 :కడప జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో హ్యాండ్‌బాల్‌ క్రీడకు చోటు కల్పించాలని హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు లయన్‌ కె.చిన్నపరెడ్డి, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ శివప్రసాద్‌లు కోరారు. గురువారం కలెక్టర్‌, జేసీకి వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హ్యాండ్‌బాల్‌ క్రీడకు సంబంధించిన స్థల కేటాయింపు విషయమై విన్నవించారు.

కాలిబాటలతో పంట దిగుబడి, తెగుళ్ల నివారణ

చెన్నూరు, జూలై 25 : రైతులు ఖరీఫ్‌ సీజన్‌లో సాగు చేసిన వరిలో మంచి దిగుబడి రావాలన్నా , తెగుళ్ల నివారణ జరగాలన్నా కాలిబాటలు తప్పనిసరి అని వ్యవసాయ శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు ఐతే నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. చెన్నూరు, గురువారం ఉప్పరపల్లెలో సాగులో ఉన్న వరి పంటను జేడీ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ వరినాట్లు వేస్తున్న రైతులతో మాట్లాడారు. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పుతో తూర్పు పడమర దిశగా కాలిబాటలు తీయడం వల్ల ఎకరాకు 3 నుంచి 4 బస్తాలు అదనంగా దిగుబడి పెరుగుతుందన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో గాలి తూర్పు పడమర దిశగా వీస్తుంది కాబట్టి వరిపంటకు గాలి వెలుతురు బాగా సోకి దుబ్బు చేయడానికి ఉపయోగపడడమే కాక సుడిదోమ సోకకుండా ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. అలాగే ఎరువులువేసేందుకు మందుల పిచికారికి ఉపయోగకరంగా ఉంటుందని ఎలుకల బెడద నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవ సాయాధికారిణి శ్రీదేవి, వీఏఏ చరణ్‌కుమార్‌రెడ్డి, రైతులు నాగమల్లారెడ్డి, అమిరేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి నిరసన



నిరసన తెలుపుతున్న మాజీ జడ్పీటీసీ రాధాకృష్ణయ్య, బీజేపీ నాయకుడు రామచంద్రారెడ్డి

చక్రాయపేట, జూలై 24: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట మాజీ జడ్పీటీసీ రాధాకృష్ణయ్య, బీజేపీ నాయకుడు రామచంద్రారెడ్డి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డిమాట్లాడుతూ రెవెన్యూ అధికారులు రైతుల పట్ల నిర్లక్ష్యం విడనాడాలన్నారు. ఎన్నికలు అయిపోయి రెండునెలలు కావస్తున్నా ఇంత వరకు తహసీల్దార్‌ కార్యాలయంలో ఫైల్లు కదలడం లేదన్నారు. ఎలాంటి చిన్నపని కూడా జరగడం లేదన్నారు. లక్షల జీతాలు తీసుకుంటూ రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. గతంలో ఉన్న తహసీల్దార్లు ఇక్కడ చేసిన అవినీతి అంతాఇంతా కాదు. ఒకరి భూములు ఒకరికి ఎక్కించడం, ఒకే నెంబర్‌ను చాలా మందికి ఎక్కించడం, డబ్బు ఇస్తే 1బీలు కూడా వచ్చేలా చేస్తారన్నారు. మాజీ జడ్పీటీసీ రాధాకృష్ణయ్య మాట్లాడుతూ తమ భూమి 10.50ఎకరాలను డిస్ప్యూట్‌లో పెట్టి వేధిస్తున్నారన్నారు. నూతనంగా వచ్చిన కలెక్టర్‌, ఆర్డీఓలు స్పందించి న్యాయం చేయాలని కోరారు. అస్తవ్యస్థంగా ఉన్న భూములను న్యాయబద్ధంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలే రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ ఏమన్నారంటే...

ఈ విషయమై తహసీల్దార్‌ బెన్నురాజు ఏమన్నారంటే.. రాధాకృష్ణయ్య పది ఎకరాల భూమి కోర్టులో ఉందని, అది పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉందన్నారు. కోర్టులో ఉన్న దాన్ని ఏమీ చేయలేనన్నారు. ఎవరో చేసిన తప్పునకు నేను బలిపశువును కావాల్సిన అవసరం లేదన్నారు. అలాగే మ్యుటేషన్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు.

వీఆర్‌ఏలను నైట్‌వాచ్‌మెన్‌గా డ్యూటీ చేయమనడం దుర్మార్గం

కడప (సెవెన్‌రోడ్స్‌), జూలై 25 :వీఆర్‌ఏలను నైట్‌వాచ్‌మెన్‌గా డ్యూటీ చేయమనడం దుర్మార్గమని, ఆ ఆదేశాలను వెంటనే రద్దు చేయాలని వీఆర్‌ఏల యూనియన్‌ జిల్లాగౌరవ అధ్యక్షుడు బి.మనోహర్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప డివిజన్‌ పరిధిలోని సిద్దవటం మండలంలోని ఎమ్మార్వో వీఆర్‌ఏలను నైట్‌ వాచ్‌మెన్‌లుగా చేయమని ఆదేశించడం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని కలెక్టరు దృష్టికి తీసుకెళతామన్నారు.


చేతిపంపునకు మరమ్మతులు

వీరపునాయునిపల్లె, జూలై 25: మండలంలోని ఉరుటూరు గ్రామంలో తాగునీటి చేతిపంపునకు మరమ్మతులు చేసి ప్రారంభించారు. శుక్రవారం కడపరూరల్‌ డెవలప్‌మెంట్‌ ఫర్‌ యువజన సంక్షేమ సమితి తరపున కార్యదర్శి నజీర్‌ అహ్మద్‌ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సంర్భంగా నజీర్‌ అహ్మద్‌ మాట్లాడుతూ చేతిపంపును పునరుద్ధరించడంతో గ్రామంలోని ప్రజలకు తాగునీటి సమస్య నుంచి ఉపశమనం లభించిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'బ్లాక్‌ మెయిల్‌ దందాలు మానుకోండి'

కడప (మారుతీనగర్‌), జూలై 25: గ్రేటర్‌ రాయలసీమ అభివృద్ధి వేదిక అనే రిజిస్టర్‌ లేని వేదికను అడ్డుపెట్టుకుని అవినీతికి పాల్పడుతున్న కె. ఆంజనేయులు తక్షణమే ఆ పద్ధతులను మానుకోవాలని రాష్ట్ర మాలమహానాడు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌.ఇమ్మానియేల్‌, తాళ్లపాక వినోద్‌కుమార్‌ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలలో విధులు నిర్వహించే దళిత, బహుజన అధికారులను బెదిరిస్తున్నారన్నారు. బద్వేల్‌, కడప తదితర ప్రాం తాలలో ప్రభుత్వ భూములను, స్థలాలను ఆక్రమించుకుని కోట్లాది రూపాయలు వెనుకేసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారు ఎక్కడ ఉన్నా, వారు ఎంతటివారైనా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

'ఆరుబయట మలవిసర్జన చేయరాదు'



మాట్లాడుతున్న డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

చెన్నూరు, జూలై 25 : ఆరుబయట మలవిసర్జన చేయరాదని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. చెన్నూరు ఎంపీడీఓ సభాభవనంలో గురువారం ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. శుభ్రంగా ఉంటేనే రోగాలకు దూరంగా ఉంటామని, ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా అనారోగ్యంపాలవుతామన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్డిని తప్పక ఉపయోగించుకోవాలన్నారు. అలాగే పంచాయతీలో పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. అభివృద్ధిలో అధికారులు ప్రజల భాగస్వామ్యం తీసుకోవాలని వారి సమస్యలు విని ఆయా ప్రాంతాల్లో ఏయే అభివృద్ధి పనులు చేపట్టాలో జాగ్రత్తగా చూడాలన్నారు.

27, 28 తేదీల్లో ఉచిత మెగా వైద్య శిబిరం

మర్మకళ, టిబెటియన్ బిందు, ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెషర్ చికిత్స ప్రత్యేకత

ప్రొద్దుటూరు టౌన్, జూలై 25: కర్ణాటకకు చెందిన వరల్డ్ హెల్త్ డెవలప్‌మెంట్, హ్యూమెన్ రైట్స్ ఫోరం, చౌడేశ్వరీదేవి తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం ఆధ్వర్యం లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సాధిక్‌బాష తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం కరపత్రాలను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ స్నేహసేవా సమితి, మన ప్రజాసేవా సమితి, ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో శనివారం, ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వసంతపేటలోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. భారతీయుల ప్రాచీనమైన మర్మకళా చికిత్స, టిబెటియన్ బిందు చికిత్స, ఆక్యుప్రెషర్, ఆక్యుపంక్చర్, కొరియన్ ఆక్యుపంక్చర్ వంటి 21 పద్ధతులతో వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. బెంగుళూరు, హైదరాబాదుకు చెందిన 10 మంది వైద్యులు వైద్యశిబిరం నిర్వహిస్తామని తెలిపారు. మోకాళ్లనొప్పి, నడుంనొప్పి, పక్షవాతం, సయాటికా, సైనసైటిస్, సర్వైకల్, స్పాండిలోసిస్ వంటి జబ్బులకు ఉత్తమ వైద్యం అందిస్తామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయుర్వేద వైద్యుడు సుబ్రమణ్యం, ఆదరణ అధ్యక్షుడు సత్యనారాయణ, స్నేహ సేవా సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూడిక తీత పనులకు రూ.1.21 కోట్లు విడుదల

ప్రొద్దుటూరు జూలై 25: ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని ప్రధాన మురికి కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టేందుకు టౌన్‌అండ్‌కంట్రీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి రూ.1.21 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఆమేరకు బ్యాంకు ఖాతాలో నేడు జమ అయినట్లు కమిషనర్ రఘునాధరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ప్రధానమైన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా వుండడంతో కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మున్సిపల్ మంత్రి నారాయణకు విన్నవించారు. రాష్ట్ర వ్యాప్తంగా 106 మున్సిపాలిటీలకు రూ.50 కోట్లు నేరుగా బ్యాంకుల ద్వారా టౌన్ అండ్‌కంట్రీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా విడుదల చేసింది. జనాభా ఆధారంగా జిల్లాలోని మున్సిపాలిటీలైన పులివెందులకు రూ.49.06 లక్షలు, జమ్మలమడుగుకు రూ.34.40, రాజంపేటకు రూ.35.26. రాయచోటికి రూ.68.12, బద్వేలుకు రూ.52.73, మైదుకూరుకు రూ.34.00 ఎర్రగుంట్లకు రూ.24 లక్షలు, కమలాపురానికి రూ. 15 లక్షలు విడుదల చేశారు.

బోగస్ పింఛన్లపై విచారణ జరిపించండి

జమ్మలమడుగు, జూలై 25: నియోజకవర్గంలో అన్ని రకాల పింఛన్లలో బోగస్ ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల పెద్దముడియం మండలం జంగాలపల్లెలో ఎక్కువగా చెవిటివారు ఉన్నట్లు బోగస్ సర్టిఫికెట్లతో ఏడాది కిందట పింఛన్లు పొందినట్లు బహిరంగ ఆరోపణలున్నాయి. మైలవరం మండలం ఎం.కంబాలదిన్నెలో డప్పు కళాకారులకు గతేడాది అధికారులు బోగస్ పింఛన్లు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. డప్పు కళాకారులు ఎస్సీ మాదిగలకు మాత్రమే ఈ పింఛన్ వర్తిస్తుందని స్థానికులు తెలిపారు. అయితే ఇటీవల జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం తదితర ప్రాంతాల్లో అన్ని రకాల పింఛన్లు బోగస్ తేలినట్లుగా తెలిసింది. అది కూడా ఎన్నికల సమయంలో కోడ్ అమలులో ఉన్నందున వలంటీర్లను ఎన్నికల కమిషన్ పక్కనబెట్టడంతో సచివాలయాల వద్ద కొందరికి, మరికొందరికి అకౌంట్లలో పింఛన్లు జమ చేసినట్లు ఆయా ప్రాంతీయులు తెలియజేశారు. వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా ఎన్నికల కమిషన్ చేసిన నిర్ణయాల వలనే బోగస్ పింఛన్లు కూడా బయటపడినట్లు కొందరు పింఛన్లు తీసుకోవడానికి సచివాలయాల వద్దకు రాకపోవడంతో బయట పడినట్లుగా తెలుస్తోంది. ఏది ఏమైనా 2019 నుంచి పింఛన్లపై విచారణ జరిపించాలని అలాంటి బోగస్ పింఛన్లను వచ్చే 1వ తేదీ వెంటనే నిలుపుదల చేయాలని ఆయా ప్రాంతాలవారు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలంటూ ర్యాలీ

జమ్మలమడుగు, జూలై 25: ఈనెల 29వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్టీసీ బస్టాండు మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు రామాజి ఇమ్మానుయేల్ తెలిపారు. గురువారం సాయంత్రం జమ్మలమడుగులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అణగారిన ప్రజల ఉన్నతి కోసం దళితులపై కొనసాగుతున్న కుల వివక్ష నిర్మూలన, వారి అభివృద్ధి కోసం ప్రతినెలా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామాల్లో పౌరులకు ఉన్న హక్కులు సామాజికంగా వివక్షకు గురవుతున్న దళితులకు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారి అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. దళితుల సమగ్ర అభివృద్ధికోసం తగిన నిధులు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో రావాల్సిన నష్టపరిహారం విడుదల చేయాలన్నారు. హత్యలకు గురైన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని అసాంఘిక సంఘటనలు, ఘర్షణలు ఎక్కువగా జరుగుతున్న జిల్లాలు, మండలాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామని ఆయన తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం

వేంపల్లె, జూలై 25: రక్తదానం చేయడం అంటే ప్రాణాన్ని రక్షించడమే అని ఎంపీడీఓ దివిజ తెలిపారు. రక్తదాన వారోత్సవాల్లో భాగంగా వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. నెహ్రూయువకేంద్రం, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. పశువైద్యాధికారి సాధిక్‌బాష, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, విజయ్‌కుమార్, రాజు, శివకృష్ణ, తేజ, రెడ్‌క్రాస్ స్పెషలాఫీసర్ శివశంకర్, నెహ్రూయువకేంద్రం కోఆర్డినేటర్ హేమంత్‌కుమార్, సుబ్బయ్య, లావణ్య, గురప్ప తదితరులు పాల్గొన్నారు.

28న ఉచిత వైద్యశిబిరం

జమ్మలమడుగు, జూలై 25: ఆర్డీఓ కార్యాలయం పక్కన రిపబ్లిక్ క్లబ్ శ్రీనివాస డిగ్రీ కళాశాల ఆవరణలో 28వ తేదీ ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు వైద్యశిబిరం నిర్వహిస్తారు. అందులో క్యాన్సర్, గుండె, బీపీ, షుగర్ కీళ్లు, ఎముకలు, కిడ్నీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, వ్యాధులతో బాధపడుతున్న వారు ప్లాస్టిక్ సర్జరీ అవసరం ఉన్నవారికి అనుభవం ఉన్న వైద్యనిపుణులచే ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ శిబిరంలో చికిత్స చేసుకుని అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తారని తెలిపారు.

ఆర్టీసీ బస్టాండు పైకప్పునకు మోక్షం కలిగేనా...?



పైకప్పు లేక అసంపూర్తిగా ఉన్న బద్వేలు ఆర్టీసీ బస్టాండు

బద్వేలుటౌన్ జూలై 25: నిత్యం ప్రయాణీకులతో రద్దీగా ఉండే బద్వేలు ఆర్టీసీ బస్టాండ్ పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మత్తులు చేసేందుకు పైకప్పును తీసేసి దాదాపు నెలలు గడుస్తున్నా ఇంత వరకూ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బద్వేలు నుంచి నిత్యం హైదరాబాదు, విజయవాడ, గుంటూరు, కావలి, బెంగుళూరు, చెన్నై, నెల్లూరు, కడప, ప్రొద్దుటూరు, పోరుమామిళ్ల ప్రాంతాలకు బస్టాండులో ప్రయాణీకులు బస్సుల కోసం పగలు, రాత్రి వేచిచూస్తూ ఉంటారు. నిత్యం బస్సుల రాకపోకలు ఉండడంతో ప్రజలు వానకు తడుస్తూ, ఎండుకు ఎండుతూ బస్టాండు ఆవరణలోనే వేచి ఉంటున్నారు. ఆర్టీసీ బస్టాండు పైకప్పు లేకపోవడంతో వర్షం వస్తే నిల్చునే వసతి కూడా లేక తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బద్వేలు ఆర్టీసీబస్టాండు పై కప్పును త్వరగా నిర్మించాలని కోరుతున్నారు.

కెమికల్ ఫ్యాక్టరీ వద్ద కొనసాగుతున్న నిరసన



నిరసన చేపడుతున్న గ్రామస్థులు

ముద్దనూరు జూలై25: పెద్దదుద్యాల సమీప జీఎం ఎకో కెమికల్ ఫ్యాక్టరీ వద్ద పెద్దదుద్యాల ప్రజలు చేపడుతున్న నిరసనలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. వారికి సంఘీభావంగా వేల్పుచర్ల గ్రామస్థులు నిరసనలో పాల్గొన్నారు. పెద్దదుద్యాల వాసి సాంబశివారెడ్డి మాట్లాడుతూ ఫ్యాక్టరీతో ఇంతగా గాలి, నీరు కలుషితవుతుందని తమకు తెలియదన్నారు. భారతి సిమెంట్ కర్మాగారంలో పనిచేస్తున్న కనక ప్రసాద్, భార్గవ్‌రెడ్డి, జెజె.రెడ్డి తమకు మాయమాటలు చెప్పి ఫ్యాక్టరీ ఏర్పాటుకు భూములు ఇప్పించారన్నారు. కొన్న ఐదెకరాలు సహా చెరువు భూమిని ఆక్రమించుకుని ఫ్యాక్టరీ, షెడ్లు, దారి ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఫ్యాక్టరీ వల్ల 5,6గ్రామాలకు ముప్పు వాటిల్లుతోందన్నారు. ఫ్యాక్టరీ మూతవేసేంత వరకూ నిరసన కొనసాగిస్తామన్నారు.

శ్వాస ప్రక్రియ విద్యార్థులకు ఎంతో మేలు

ప్రధానోపాధ్యాయుడు షేక్ కమాల్



యూత్ ఎంపవర్‌మెంట్ సెమినార్ శిక్షణలో విద్యార్థినీ విద్యార్థులు

కలసపాడు, జూలై 25: శ్వాస ప్రక్రియ విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయని ప్రధానోపాధ్యాయుడు షేక్ కమాల్ అన్నారు. కలసపాడు మండలం ఈరామాపురం ఉన్నత పాఠశాల, కలసపాడు మహిళా ఉన్నత పాఠశాల, పెండ్లిమర్రి కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినీ విద్యార్థులకు యూత్ ఎంపవర్‌మెంట్ సెమినార్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్లు టీఎస్ నారాయణరెడ్డి, సంఘ సేవకులు సాయికిరణ్, మనోహర్‌రెడ్డి, బిందు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ శిక్షణ ద్వారా విద్యార్థినీ విద్యార్థుల్లో వత్తిడి తొలగించుకోవడానికి శ్వాస ప్రక్రియలు బాగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పోష్ యాక్ట్‌పై అవగాహన అవసరం

పోరుమామిళ్ల, జూలై 25: మహిళా ఉద్యోగులకు రక్షణ కవచంలాంటిది పోష్ యాక్ట్ అని తహసీల్దారు శిరీషా అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంఈఓ, ఐసీడీఎస్, హెల్త్ డిపార్ట్‌మెంట్, మండల లెవెల్ ఆఫీసర్లతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా ఉద్యోగినుల పట్ల ఎవరైనా అమర్యాదగా ప్రవర్తిస్తే వారికి రక్షణ కవచంలాంటిది పోష్ యాక్ట్ అన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ మహిళా ఉద్యోగికి ఇబ్బంది కలిగితే పది మంది సభ్యులతో కమిటీ ఉంటుందని, వారు ఆ కమిటీ ద్వారా తాము ఎదుర్కొంటున్న సమస్యలు వారి దృష్టికి తెస్తే విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వర ప్రసాదరావు, ఎంఈఓ కాశయ్య, ఇన్‌ఛార్జ్ సీడీపీఓ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వం పొందండి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 25: జనసేన పార్టీ కార్యకర్తలు, ప్రజలు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకోవాలని జనసేన నేతలు కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 28వ తేదీ వరకు 4వ విడత పార్టీ సభ్యత్వ నమోదు కొనసాగుతుందన్నారు. సభ్యత్వం తీసుకున్నవారికి రూ.5 లక్షల ప్రమాదబీమా కల్పిస్తారని ఈ అవకాశాన్ని జనసేన కార్యకర్తలు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జనసేన నేతలు జిలానీ బాష, సుధీర్, విజయకుమార్, ప్రసాద్‌రామాజీ పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వం



సభ్యత్వ నమోదు చేపడుతున్న జనసైనికులు

ముద్దనూరు జూలై25: స్థానిక పాత బస్టాండులో గురువారం జనసేన క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. జమ్మలమడుగు జనసేన కోఆర్డినేటర్ జగదీష్, ముద్దనూరు జనసేన నేత కిరణ్‌కుమార్‌రాయల్ ఆధ్వర్యంలో సభ్యత్వ కార్యక్రమం చేపట్టారు. సభ్యత్వం, బీమా కూడా చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాద బీమా రూ.500 చెల్లిస్తే 5లక్షలు పరిహారం వస్తుందన్నారు. జనసేన నేతలకు, జనసైనికులకు, వీరమహిళలు వారి కుటుంబాలకు అండగా ఉండేందుకు బీమా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో చంద్ర, లక్ష్మీనారాయణరెడ్డి, విగ్నేష్, శేఖర్, సురేంద్ర, వీర, ముద్దకృష్ణ, రాజా, ధీరజ్, పవన్‌కళ్యాణ్, శివ, హాజీ తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటలతో పంట దిగుబడి, తెగుళ్ల నివారణ

చెన్నూరు, జూలై 25: వరిలో మంచి దిగుబడి రావాలన్నా, తెగుళ్ల నివారణ జరగాలన్నా కాలిబాటలు తప్పనిసరని వ్యవసాయ శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు ఐతే నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఉప్పరపల్లెలో సాగులో ఉన్న వరి పంటను జేడీ పరిశీలించారు. వరినాట్లు వేస్తున్న రైతులతో మాట్లాడుతూ ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పుతో తూర్పు పడమర దిశగా కాలిబాటలు తీయడం వల్ల ఎకరాకు 3 నుంచి 4 బస్తాలు అదనంగా దిగుబడి పెరుగుతుందన్నారు. వర్షాకాలంలో గాలి తూర్పు పడమర దిశగా వీస్తుంది కాబట్టి వరిపంటకు గాలి వెలుతురు బాగా సోకి దుబ్బు చేయడానికి ఉపయోగపడడమే కాక సుడిదోమ సోకకుండా ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. ఎరువులు వేసేందుకు మందుల పిచికారీకి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీదేవి, వీఏఏ చరణ్‌కుమార్‌రెడ్డి, రైతులు నాగమల్లారెడ్డి, అమిరేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పులివెందుల టౌన్,జూలై 25: స్థానిక ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు పులివెందుల డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుందన్నారు. 9959225780కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. 9959225780కు వాట్సాప్‌కు సమస్యలు మెసేజ్ చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులను కోరారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి



అధికారులకు సూచనలు ఇస్తున్న డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

ఖాజీపేట, జూలై 25: ప్రతి గ్రామం శుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, డిజిటల్ అసిస్టెంట్లకు నిర్వహించిన సంయుక్త సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపరితల జలాశయాలు, భూతల జలాశయాలు, మినరల్ వాటర్‌ప్లాంట్స్ 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేస్తూ ఉండాలని, రోజువారి పారిశుధ్య పనులు నిర్వహిస్తూ రికార్డులను నిర్వహించాలన్నారు. అధికారులు వీటిపై అశ్రద్ధచూపితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతి ఇంటినీ సర్వే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓపీఆర్డీ వెంకటసుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, డిజిటల్ పంచాయతీ అధికారి రమణారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధార్మిక ప్రవచనాలు

బ్రహ్మంగారిమఠం, జూలై 25: కాలజ్ఞానకర్త పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సన్నిధానంలో విశ్రాంత ఉప కార్యదర్శి రీడర్ పాణ్యం దత్తశర్మ భక్తులకు ధార్మిక ప్రవచనాలు నిర్వహించారు. గురువారం ఆలయ ప్రాంగణలో భక్తులకు ధార్మిక ప్రవచనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టు పక్కల ఉన్న ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

- సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్

కడప(రూరల్) జూలై 25: వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని బిల్డప్ సర్కిల్ నుంచి రెండో గాంధీ విగ్రహం వరకు హెల్మెట్ వాడకంతో ఉపయోగాలపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. మనల్ని, మన కుటుంబాన్ని రక్షించుకోవాలంటే తప్పనిసరిగా వాహనాల్లోవెళ్లే వారు హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రతా నియమావళిని పాటించాలన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో గురువారం కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల నుంచి పులివెందుల రోడ్డు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. కడప రూరల్ సీఐ శంకర్‌నాయక్, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు, పారాలీగల్ వాలంటీర్లు, ప్యానల్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ఎన్జీఓలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉపయోగం

వల్లూరు, జూలై 25: విద్యార్థులకు అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉప యోగపడుతుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు తెలిపారు. మూడురోజులుగా తమ ల్యాబ్‌లో విద్యార్థులు చేసిన సైన్స్ ప్రాజెక్టులను గురువారం ప్రదర్శించినట్లు ఆయన తెలిపారు. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం వికసింపజేయడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు పాఠ్యప్రణాళికలో వారు నేర్చుకున్న అంశాలను చేయడంతో సాకేంతిక పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.వెంకటనారాయణ, లక్ష్మీనారాయణ, ప్రొఫెసరు మహేశ్‌నాయక్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నీతి వాక్యాలు కాదు.. పనులు చేయండి

- గ్రామసభలో సర్పంచ్, కార్యదర్శులను ప్రశ్నించిన ప్రజలు



గ్రామ సభలో మాట్లాడుతున్న ఈఓఆర్డీ సురేశ్‌బాబు

చెన్నూరు, జూలై 25: నీతి వాక్యాలు చెప్పడం కాదు.. ప్రజలకవసరమైన పనులు చేయాలని పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డిని, సర్పంచ్ వెంకటసుబ్బయ్యను ప్రజలు ప్రశ్నించారు. గురువారం చెన్నూరు సర్పంచ్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో బీజేపీ నేత సుధీర్‌రెడ్డి, వార్డు సభ్యుడు కల్లూరు ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త రోడ్డుపై బస్సుషెల్టరు లేదని, మురుగుకాల్వలు లేవన్నారు. బస్‌షెల్టరు లేకపోవడంతో ఇటీవల ఓ వృద్ధురాలు బస్సుకోసం వచ్చి ఎండ వేడిమికి తాళలేక స్పృహ తప్పి పడిపోయిందన్నారు. ప్రయాణికులు దుకాణాలు, మాంసం కొట్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దోమల నివారణకు మందుకొట్టించిన దాఖలాలు లేవన్నారు. గ్రామ నేత వీరారెడ్డి మాట్లాడుతూ పాత బస్టాండు వద్ద ఐదో వార్డు స్కూలు గేటు ముందు వ్యర్థాలు వేస్తున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ హైవేపై బస్‌షెల్టరు, కాల్వలకు ప్రతిపాదనలు పంపామని, ఇంత వరకూ స్పందన లేదన్నారు. ఈఓఆర్డీ సురేశ్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వాడాలని, చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయవద్దన్నారు. ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. పంచాయతీలో 20 మంది వార్డుసభ్యులకు నలుగురు మాత్రమే హాజరయ్యారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ట్రాఫిక్‌పై స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్న సీఐ చిరంజీవి

పోరుమామిళ్ల, జూలై 25: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ చిరంజీవి హెచ్చరించారు. గురువారం పోరుమామిళ్లలో ట్రాఫిక్‌పై ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వరికుంట్ల బస్టాండు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు రోడ్డుకిరువైపులా ఉన్న దుకాణదారులను వాహనాలు నిలిపే వారికి హెచ్చరికలు జారీ చేశారు. ట్రాఫిక్‌కు ఏదైనా వాహనాలు అడ్డంగా ఉంచితే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిమోతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముద్దనూరు జూలై25: ఎర్రగుంట్ల రోడ్డులోని తిమ్మాపురం గ్రామం వద్ద గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకెళితే... ఎర్రగుంట్ల వైపు నుంచి తిరుపతికి చెందిన అశోక్‌నాయక్, ముద్దనూరు వైపు నుంచి పులివెందుల వాసి శ్యామ్ సుందర్‌రెడ్డి ద్విచక్రవాహనాల్లో వస్తున్నారు. తిమ్మాపురం వద్దకు ఎదురుగా ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని చికిత్స నిమిత్తం 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రాజోలి జలాశయం నిర్మాణానికి అనుమతులు ఇవ్వండి : పుట్టా



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్

మైదుకూరు రూరల్ జూలై 25: అసెంబ్లీ సమావేశాలు జరుతున్న నేపధ్యంలో భాగంగా గురువారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ రాజోలి జలాశయం నిర్మాణానికి అనుమతులు ఇవ్వమని అసెంబ్లీలో కోరారు. కేసీ కెనాల్ ఆయకట్టు కింద సుమారు 90 వేల ఎకరాల్లో పంటలు పండుతున్నాయని తెలిపారు. జలాశయం నిర్మాణం పూర్తి అయితే తాగు, సాగునీటికి కరువే ఉండదని తెలిపారు. నిర్మాణం పూర్తి అయితే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని తెలిపారు.

పగలే వెన్నెల



ఖాజీపేట, జూలై 25: విద్యుత్తు పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా అధికారులు గ్రామాల్లో, పట్టణాల్లో వీధిలైట్లు పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. ఖాజీపేట సర్కిల్‌లో వైసీపీ ప్రభుత్వం లైట్లు ఏర్పాటు చేశారు. అయితే అప్పట్లో వాటికిఆటోమేటిక్ ఆఫ్ఆన్ మీటర్లు బిగించకపోవడంతో ఇష్టానుసారంగా రాత్రింబవళ్లు వెలుగుతున్నాయి. గ్రామాల్లో కూడా ప్రజలు చూడలేక పగలు వెలిగితే బల్బులు పోతాయని వాటిని ఆపుతుంటారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పగలు వెలుగకుండా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.